క్లుప్తంగా

ఘనంగా మట్టల ఆదివారం



ఊరేగింపు నిర్వహిస్తున్న పిల్లలు, సంఘస్తులు

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ సీఎస్ఐ వెస్లీ చర్చి సంఘకాపరి రెవరెండ్ జి దినకర్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లలు, వృద్ధులు, సంఘస్తులు ఈత మట్టలు చేత పట్టుకుని గ్రామంలో ఊరేగింపు చేపట్టారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సిరికొండ: మండలంలోని రావుట్లలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ నాయకుడు దామోదర్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఈ రమేశ్, జమున, శ్యామల, వీడీసీ చైర్మన్ ఆనంద్, తోట రాజన్న, రమేశ్‌గౌడ్, సామేల్, దాసు, గోపాల్‌గౌడ్, కుమ్మరి గంగు పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాలలో సెమినార్



నిజామాబాద్ అర్బన్: అంబేడ్కర్ 134 జయంతిని పురస్కరించుకొని గిరిరాజ్ కళాశాలలో ఆదివారం సామాజిక సాధికారత వారోత్సవాల్లో భాగంగా భారత రాజ్యాంగం సామాజిక న్యాయం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ఆవిర్భావం, భారత రాజ్యాంగం విశిష్టత, సామాజిక అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సమన్వయకర్త రంజిత, అధ్యాపకులు పోశెట్టి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం



అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న నాయకులు

సిరికొండ: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, రాజేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మధు, ప్రభాకర్, గంగారెడ్డి, మారుతి, కిరణ్, అజయ్, సాగర్, శ్రీనివాస్, దాసు తదితరులు పాల్గొన్నారు.

16న సిద్ధివినాయక ఆలయ వార్షికోత్సవం

నిజామాబాద్ రూరల్: నగరంలోని గాయత్రినగర్‌లో ఉన్న సిద్ధివినాయక స్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాలను 16 నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మచ్చ చంటయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16న సంకష్ట చతుర్థి పూజా, భజన, అన్నదాన కార్యక్రమాలు, 17న స్వామివారికి అభిషేకం, అలంకరణ, 18న స్వామివారికి కల్యాణం, పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక ఆలోచనలు పెంపొందాలి



నిర్వాహకులను సన్మానిస్తున్న సభ్యులు

నిజామాబాద్‌రూరల్: ప్రతి భక్తుడు తమ ఇంట్లో పారాయణం నిర్వహించుకోవాలని, ఆధ్యాత్మిక ఆలోచనలు పెంపొందించేలా చూడాలని గీతా మందిరం నిర్వాహకుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న గీతా మందిరంలోఇంటింటా పారాయణం.. ప్రతి ఆదివారం పేరిట ప్రతి భక్తుని ఇంట్లో ఇంటింట పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పారాయణ కమిటీ నేటితో 162 పారాయణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 54 ఇళ్లలో పారాయణం చేసిన వారికి గీతా మందిరంలో సన్మానించారు. కార్యక్రమంలో శనిశెట్టి కిషన్, చిదుర రమేశ్, పి జ్యోతి, మామిడి రాజకుమార్, గాలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడు సేద తీరిన పల్లె

- నాటి దారిపల్లెనే.. నేటి ధర్పల్లి
- ద్వాపరయుగం నాటి చరిత్ర ఈ పల్లె సొంతం
- చరిత్రకు సాక్ష్యంగా జగన్నాథ ఆలయం



జగన్నాథ స్వామి ఆలయం, ఆలయంలోని మూలవిరాట్ విగ్రహాలు



ధర్పల్లి గ్రామ చిత్రం

ధర్పల్లి: ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు ఉత్తర భారతం నుంచి దక్షిణభారతానికి వచ్చిన సమయంలో దారి మధ్యలో ఆగిన పల్లెనే దారిలోని పల్లెగా పేరుగాంచిందని.. అది కాస్త రాను రాను ధర్పల్లిగా ప్రసిద్ధిగాంచిందని ప్రతీతి. రాజుల కాలంలో ధర్పల్లికి చుట్టుపక్కల పెద్ద పెద్ద నగరాలుగా సీతాయిపేట్, హోన్నాజిపేట్, దమ్మన్నపేట్ ఉండేవి. దీంతో వ్యాపారులు, ధనవంతులు వ్యాపారం కోసం ఈ నగరాలకు వచ్చేవారని, అలా వచ్చేటప్పుడు దారి మధ్యలో సేద తీరేవారు. ఆ గ్రామాలకు వెళ్లే దారి ప్రధాన కూడలీలో ఈ గ్రామం ఉండడంతో దారిపల్లెగా పేరుగాంచిందని.. రాను రాను ధర్పల్లిగా రూపాంతరం చెందిందని పూర్వీకులు చెబుతున్నారు.

చరిత్రకు సాక్ష్యం జగన్నాథుడి ఆలయం

ధర్పల్లి మీదుగా శ్రీకృష్ణుడు వెళ్లాడనే దానికి నిదర్శనంగా మండల కేంద్రంలోని మాలగుట్టపై పెద్ద బండరాళ్ల మధ్య జగన్నాథుని ఆలయం నెలకొని ఉంది. శ్రీకృష్ణుడు లోక సంచారం చేస్తూ నడిచిన నేల కాబట్టే ఆయనకు గుర్తుగా ఆలయం నిర్మించి పూజలు నిర్వహిస్తున్నారు.

మామూలు పల్లె నుంచి మండలంగా..

చిన్న దారిపల్లెగా ఉన్న గ్రామం అభివృద్ధి చెందుతూ మండలంగా రూపాంతరం చెందింది. 1960లో గ్రామం పలు అభివృద్ధి పనులకు నోచుకుంది. దీంతో గ్రామం రూపురేఖలు మారుతూ వచ్చాయి. 1964లో గ్రామానికి విద్యుత్ సరఫరా, 1970లో బ్యాంక్, పోస్టాఫీస్ ఏర్పడి రోడ్ల నిర్మాణానికి నోచుకున్నది. 1985లో మండల వ్యవస్థ రూపొందడంతో చుట్టుపక్కల గ్రామాలకు ప్రధాని కూడలిగా ఉన్న ధర్పల్లిని మండలంగా ఏర్పాటు చేశారు. నాటి ఎమ్మెల్యే థామస్ సహకారంతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి కర్ణం రామచంద్రరావును కలిసి విన్నవించడంతో వారి కృషి ఫలితంగా ధర్పల్లి మండలంగా ఏర్పాటైందని పూర్వీకులు చెబుతున్నారు.

విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీధర్

నిజామాబాద్ అర్బన్: విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పూర్వ పీడీఎస్‌యూ నాయకుడు, సీనియర్ న్యాయవాది పరుచూరి శ్రీధర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. నగరంలో నీలం రామచంద్రయ్య భవన్‌లో పీడీఎస్‌యూ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. సమావేశానికి పరుచూరి శ్రీధర్ హాజరై మాట్లాడారు. విదేశాల్లో విద్యను ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తుంటే మనదేశంలో మాత్రం విద్య వ్యాపారమైందన్నారు. విద్యాభివృద్ధికి కొఠారి కమిషన్ కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం శాతం నిధులు రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని సూచిస్తే కేంద్రంలో 2 శాతం, రాష్ట్రంలో 7 శాతానికి మించి కేటాయించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించడం దుర్మార్గమని అన్నారు. పీడీఎస్‌యూ నాయకుడు జి రమేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో పీడీఎస్‌యూ విద్యార్థుల తరఫున అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్, ప్రిన్స్, దేవిక, మనోజ్, నిఖిల్, ఆకాశ్, రాహుల్, సాయి కిరణ్, నాందేవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సభను విజయవంతం చేయాలి



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న డిచ్‌పల్లిలో నిర్వహించే సన్నాహక సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ పిలుపునిచ్చారు. ఆదివారం డిచ్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ కార్యకర్తలు, రైతులు, అభిమానులు, మాజీ ప్రజాప్రతినిధులు తెలంగాణ ఆత్మ గౌరవం కోసం సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సాయిలు, నర్సయ్య, పద్మారావు, సుదాం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



వంగి పోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామానికి పెద్దవాల్గోట్ గిర్ని చౌరస్తాకు మధ్యన పొలాల్లో విద్యుత్ స్తంభం పూర్తిగా వంగిపోయి ప్రమాదకరంగా ఉంది. పది రోజుల క్రితం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి స్తంభం వంగిపోయింది. అక్కడ పొలాల్లో వరి కోతలు పూర్తవడంతో ప్రమాదం తప్పింది. వంగిపోయిన ఇనుప స్తంభం బరువుకి తీగలు తెగిపోయి స్తంభం పడిపోయేలా ఉంది. 11 కేవీ లైన్ కావడంతో తీగలు తెగిపోతే ప్రమాదం పొంచి ఉంది. స్తంభం వంగిపోయి పది రోజులు గడుస్తున్నా ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మత్తులు చేపట్టకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం సంభవించకముందే స్తంభాన్ని సరి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎంపీని కలిసిన గౌడ కులస్తులు



ఎంపీ అర్వింద్‌ను సన్మానిస్తున్న గౌడ కులస్తులు

ధర్పల్లి: ధర్పల్లి మండలానికి చెందిన గౌడ సంఘం సభ్యులు ఎంపీ ధర్మపురి అర్వింద్ ను నిజామాబాద్‌లోని తన పార్టీ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గౌడ సంఘం అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంపీకి వినతిపత్రాన్ని అందజేశారు. ధర్పల్లిలోని ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించాలని వారు ఎంపీని కోరారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషిగా నిధుల మంజూరుకి సానుకూలత ఎంపీ తెలిపినట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హరీశ్ గౌడ్,నరేందర్ గౌడ్, రమేశ్ గౌడ్, ప్రవీణ్ గౌడ్,శ్యామ్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

వనజీవి రామయ్యకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న జనార్దన్

సుభాష్‌నగర్: ఖమ్మం జిల్లా రెడ్డిపల్లిలో వనజీవి రామయ్య మృతదేహానికి సిరివెన్నెల గ్రీన్ సొసైటీ వ్యవస్థాపకుడు రావుట్ల జనార్దన్ ఆదివారం ఘన నివాళులు అర్పించారు. అంత్యక్రియలు పూర్తయిన తర్వాత అక్కడే మొక్కలు నాటారు. ఆయన స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని మొక్కలు నాటుతామని జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం రామయ్య చేసిన సూచనలు, సలహాలు గుర్తుచేసుకున్నారు.

రూ. ఐదు లక్షల ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామానికి చెందిన దూస సంతోష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అతని చికిత్స కోసం మంజూరు చేయించిన రూ. ఐదు లక్షల ఎల్‌వోసీ ప్రతులను కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసిన బీజేపీ నాయకుడు మెండె అశోక్, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిలకు సంతోష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు వరం 'సీఎంఆర్ఎఫ్'



జక్రాన్‌పల్లిలో చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, నాయకులు

జక్రాన్‌పల్లి: అనారోగ్యంతో మెరుగైన వైద్యం చేయించుకోలేని బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. జక్రాన్‌పల్లి, తొర్లికొండ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లిలో తొమ్మిది మంది లబ్ధిదారులకు మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, తొర్లికొండలో పది మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు చెక్కులను అందజేశారు. కార్యక్రమాల్లో వినోద్, గంగారెడ్డి, గంగారెడ్డి, వసంత్‌రావు, ఉత్కం శ్రీనివాస్‌గౌడ్, కనక రవి, జితేందర్‌నాయక్, అక్బర్‌ఖాన్, అనుపాల కిరణ్, తాజొద్దీన్, నల్ల గంగారెడ్డి, రాజేశ్వర్, రాజేశ్ ఖన్నా, గంగారాం, శ్రీనివాస్‌గౌడ్, సన్నీ యాదవ్, సంతు యాదవ్, మహి, రాజేశ్వర్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నల్లవెల్లిలో..

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం నల్లవెల్లిలో ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ దన్ల రాజు పంపిణీ చేశారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్ధన్‌తండాలో..

సిరికొండ: సిరికొండ మండలం వర్ధన్ తండాలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బానావత్ మోజీరాం, మాజీ సర్పంచ్ సంగ్యనాయక్, మాజీ ఉపసర్పంచ్ సంతోష్, జగన్, పంత్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



తొర్లికొండలో చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు



వర్ధన్ తండాలో..

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



విద్యార్థులతో ప్రోగ్రాం ఆఫీసర్ కుమారస్వామి

ధర్పల్లి: మండలంలోని సీతాయిపేట్‌లో ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి కాలం ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ కుమారస్వామి తెలిపారు. గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో వలంటీర్లు పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్, మాదకద్రవ్యాలు, మూఢనమ్మకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. శిబిరం ముగింపు కార్యక్రమానికి కళాశాల బొటనీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ రవిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు సాగాలని ప్రోగ్రాం ఆఫీసర్ కుమార్ స్వామి అన్నారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న వాలంటీర్ల అందరికీ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.

ప్యాకేజీ21 పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ/ నిజామాబాద్‌నాగారం: మంచిప్ప ప్రాజెక్టు ప్యాకేజీ21 పనులకు తగిన నిధులు మంజూరు చేసి పనులను త్వరగా పూర్తిచేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అనేక రైతాంగ పోరాటాల ఫలితంగా గోదావరినదిపై అలీసాగర్ గుత్ప ఎత్తిపోతలు సాధించుకోవడం జరిగిందన్నారు. మంచిప్ప ప్రాజెక్టు ద్వారా గడ్కోల్ సెగ్మెంట్‌లో రూరల్ నియోజకవర్గ పరిధిలో 5, 6 మండలాల్లో 84 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు మంచిప్ప ప్రాజెక్టును నిర్మిస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు పనులు గత రెండేళ్లుగా నిలిచిపోయాయన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చొరవతీసుకుని ప్రభుత్వపెద్దలతో మాట్లాడి ఈ ప్రాజెక్టు పూర్తిచేసి రైతులకు సాగునీరందించేలా చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు వేల్పూర్ భూమయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	93,700	వెండి(కిలో)	98,000
22 క్యారెట్స్	85,562		

- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
బీరకాయ	50	70	దోసకాయ	25	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	12	24
కాకరకాయ	50	90	గోబిపువ్వు	40	60
వంకాయ	12	24	బీట్‌రూట్	20	40
పాలకూర	25	50	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	60	80
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

- సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 జాక్(తెలుగు)-10.45, 1.30, 4.20, 7.20, 10.20
- స్క్రీన్-2 గుడ్ బ్యాడ్ అగ్లీ(తెలుగు)-1.40, 10.20
- ఫలక్‌నుమా దాస్(తెలుగు)-4.30
- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి(తెలుగు)-7.30
- స్క్రీన్-3 జాట్(హిందీ)-11.00, 1.40, 7.30
- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి -4.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 గుడ్ బ్యాడ్ అగ్లీ(తెలుగు)-10.40, 1.35, 7.15, 10.10
- మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-4.30
- స్క్రీన్-2 జాక్(తెలుగు)-10.20, 1.15, 4.10, 7.05, 10.00
- స్క్రీన్-3 జాట్(తెలుగు)-10.00, 1.10, 4.20, 7.30, 10.40
- స్క్రీన్ -4 అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి -10.05, 1.10, 4.15, 10.25
- ఫలక్‌నుమా దాస్(తెలుగు)-7.15

లలితామహల్ జాక్ (తెలుగు)

దేవి గుడ్ బ్యాడ్ అగ్లీ (తెలుగు)

నటరాజ్ జాట్(హిందీ), **విజయ్** మ్యాడ్ స్క్వేర్

రామన్నలొద్ది రోడ్డుకు మోక్షం!

- పీసీసీ అధ్యక్షుడి హామీ మేరకు త్వరలోనే పనులు ప్రారంభం



రోడ్డు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ నుంచి రామన్నలొద్ది ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించనుంది. ఇటీవల శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. అందులో భాగంగా రోడ్డు నిర్మాణానికి అనువైన స్థలం, అంచనాలను తయారీకి ఆర్అండ్‌బీ అధికారుల బృందం బుధవారం రహత్‌నగర్ నుంచి రామన్నలొద్ది వరకు పరిశీలించారు. ఇప్పటి వరకు మెటల్ రోడ్డు ఉండడంతో కంకర తేలి గుంతలమయం అయ్యేది. ఆలయానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులుపడేవారు. తారు రోడ్డు నిర్మించాలని భక్తులు పీసీసీ అధ్యక్షుడికి విన్నవించిన విషయం తెలిసిందే. అధికారులు స్థల పరిశీలన చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎండలోనే ఫైర్



బాల్కొండ: మండల కేంద్రంలో 2023 అక్టోబర్‌లో ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే మంటలు ఆర్పే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో బాల్కొండ మండల కేంద్రంగా ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఐకేపీ కార్యాలయం నిర్వహించిన ఇరుకు గదిలో కార్యాలయం ఏర్పాటు చేశారు. ఫైర్‌స్టేషన్ కార్యాలయ నిర్మాణం కోసం జాతీయ రహదారి-44 పక్కన బండరాళ్లతో కూడిన 20 గుంటల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. కాని నిధులు లేకపోవడంతో ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఫైర్ స్టేషన్‌కు నాలుగు నెలల క్రితం నూతనంగా ఫైరింజన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ నీడలో ఉంచటానికి షెడ్డు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఫైర్ ఇంజిన్ ఎండలోనే ఎండుతోంది. దీనివల్ల ఫైరింజన్ దెబ్బ తినే ప్రమాదం ఉందని సిబ్బంది చెబుతున్నారు. ఫైరింజన్‌ను భద్రపరచటానికి షెడ్డు నిర్మించడంతో పాటు పక్కా భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ కోరుతున్నారు.